# తెలుగు బడి

ఆస్టిన్, టెక్సాస్‌లోని మా తెలుగు బడిలో బోధనా పద్ధతులు ఏమిటి అని చాలమందికి చాల ప్రశ్నలున్నాయి. మరి మా అనుభవాలు ఎలా వున్నాయో చూద్దాం.

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికావారు 1998లో అట్లాంటాలో నిర్వహించిన మొదటి అమెరికా తెలుగు సాహిత్య సదస్సులో తెలుగుగేతర ప్రాంతాలలో పిల్లలకి, ముఖ్యంగా అమెరికాలో పెరిగే రెండో తరం పిల్లలకి తెలుగు నేర్చుకోవలసిన అవసరం వుందా అని ఒక చక్కటి చర్చ జరిగింది. ఈ విషయం మీద పలురకాల అభిప్రాయాలు వినపడ్డాయి. కొంతమంది అసలు ఇండియాలోనే, మన తెలుగు దేశంలోనే తెలుగు మరిచిపోతుంటే (కొంతమంది తెలుగు చచ్చిపోతుంటే అనే మాటకూడా వాడారు) , అమెరికాలో మన పిల్లల మీద రుద్దటం ఎందుకు అన్నారు. కాదు అవసరమే, మన పిల్లలకి మనం తెలుగు నేర్పకపోతే ఎలా అన్నారు కొందరు.

'అసలు తెలుగు దేశంలోనే తెలుగు మరిచిపోతుంటే, అమెరికాలో మన పిల్లల మీద రుద్దటం ఎందుకు' అనే వాదనని నేను ఒప్పుకోవటంలేదు. ఏ భాషా అంత తొందరగా మరుగున పడదు. మిగతా భాషల ప్రభావంతో రూపాంతరం చెందుతుందేమో కానీ 'చచ్చి'పోదు. చుట్టుపక్కలవున్న ఇతర భాషల ప్రభావం, వాటిలోని కొన్ని మాటల్ని ఆ భాషలో కలిపేసుకోవటం సహజమే కూడాను. ఉదాహరణకి ఇంగ్లీషునే తీసుకుందాం. ఇంగ్లీష్‌లోకి ఎన్నో మాటలు ఎన్నో భాషలనించీ వచ్చి చేరాయి. ఫ్రెంచ్, ఇటాలియన్, స్పానిష్ నించీ కాకుండా, మన తెలుగు, సంస్కృతం, తమిళ్‌నించీ ఎన్నో మాటల్ని కలిపేసుకుంది ఇంగ్లీష్. అంతేకాదు నాటినించీ ఈ నాటిదాకా బలం పుంజుకుంటూనే వుంది. భాష సంస్కృతిలో భాగం. సంస్కృతులున్నంత వరకూ భాషలూ వుంటాయి. ఈ విషయంలో నా వాదన ఏమిటంటే, మన పిల్లలకి తెలుగు నేర్పటమా నేర్పకపోవటమా అన్నది మన నిర్ణయం కాకూడదు. అది పిల్లల ఇష్టం మీద ఆధారపడి వుంటుంది. మనం చేయవలసిందల్లా ఆ ఉత్సాహం, వాతావరణం, నేర్చుకోవటానికి అవకాశాలు కల్పించటం. అదీ మనం చేయాల్సింది. ఆ నిర్ణయం తీసుకోవటానికి కావలసిన సమాచారం వాళ్ళకి ఇవ్వటం మన బాధ్యత.

నేను పంథొమ్మిది వందల డెబ్భయ్యో దశకంలో, సుందరమైన కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో పని చేస్తున్నప్పుడు, అక్కడ తెలుగు బడి పెట్టి మూడేళ్ళ పైన మన పిల్లలకి తెలుగు నేర్పించాం. నా విద్యార్థుల్లో ఒక అమ్మాయి, ఇప్పుడు పెళ్ళి చేసుకుని అమెరికా వచ్చి ఒక హైటెక్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. మమ్మల్ని చూట్టానికి ఆస్టిన్ వచ్చినప్పుడు ఇంగ్లీష్, మళయాళం యాసలు లేకుండా చక్కటి తెలుగులో మాట్లాడుతుంటే ముచ్చట వేసింది. అప్పుడే అడిగాను 'ఏమ్మా! కేరళలో పెరిగినా ఇంత చక్కటి తెలుగు మాట్లాడుతున్నావే' అని. 'మీరే కదా అంకుల్, మాకు తెలుగు నేర్పింది' అంది. నేను నేర్పింది కేవలం మూడేళ్ళే. అది ఒక పునాది

మాత్రమే. కాకపోతే ఆ పునాది మీద తెలుగుని ఎంతో గట్టిగా, ఈ నాటికీ మరిచి పోకుండా నిలబెట్టగలిగింది. 'నాకు వ్రాయటం సరిగ్గా రాదు కానీ, బాగా చదవ గలను' అంటుంటే, పైన తెలుగు ఎందుకు అని వాదించినవారికి ఇవ్వటానికి జవాబు దొరికినట్టయింది.

తర్వాత రెండేళ్ళు హ్యూస్టన్‌లో మన పిల్లలకి తెలుగు చెప్పాను. మళ్ళీ 1993లో ఆస్టిన్‌లో నేను తెలుగు స్కూల్ మొదలుపెట్టినప్పుడు, మన పద్ధతి ప్రకారం ఇండియానించీ తెచ్చిన వాచకాలు (ఒకటో తరగతి నించీ పదో తరగతి దాకా) చూసి చదువు నేర్పించటం మొదలుపెట్టాను. వెంటనే అర్థమైపోయింది. అమెరికాలో పెరిగే పిల్లలకి, మన బలి చక్రవర్తి కథల ద్వారా తెలుగు చెప్పటం వల్ల లాభం లేదని. 15 మందితో మొదలైన క్లాస్‌లో, నెల రోజుల్లోనే సగం మంది రావటం మానేశారు. అప్పుడే అనిపించింది, ఇక్కడి బోధనా పద్ధతులు మార్చుకోవటం అవసరం అని. అమెరికాలో, ఆ మాటకి వస్తే విదేశాంధ్రులందరిలోనూ, రెండో తరం వాళ్ళు తెలుగు నేర్చుకోవటనికి కారణాలు వేరు. అందుకని మా విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో వివరంగా మాట్లాడాక మా బోధనా పద్ధతులు పూర్తిగా మారిపోయాయి. అప్పటి నించీ మా క్లాస్‌లో పిల్లల సంఖ్య మళ్ళీ ముప్ఫయ్‌దాక వెళ్ళింది. విద్యార్థుల వయస్సు ఆరేళ్ళనించీ పదహారు ఏళ్ళు. అంతేకాదు. ఒకళ్ళిద్దరు వయసులో పెద్దవాళ్ళు కూడా తెలుగు నేర్చుకోవాలనే ఉత్సాహంతో ముందుకి వచ్చారు.

మా క్లాస లక్ష్యాలు ఐదు. విద్యార్థులకి తెలుగు మాట్లాడటంలో ప్రావీణ్యం, వాక్య నిర్మాణంలాటివి, తెలుగులో వారి పద సంపదని (వొకాబ్యులరీ) పెంచటం, రోజువారీ సంభాషణకి అవసరమైనంతగా సహాయం చేయటం, అక్షరాలని గుర్తు పట్టి చదవటానికి ప్రయత్నం చేయటం, ఇండియా గురించీ ఆంధ్రప్రదేశ్ గురించీ తెలుసు కోవలసిన విషయాలు చెప్పటం. ఈ ఐదు లక్ష్యాలతోనూ సాగింది మా తెలుగు బడి ప్రయాణం.

తరగతులని రెండుగా విభజించాం, వయసు సంబంధంగా కాకుండా తెలుగు పరిజ్ఞాన సంబంధంగా. ప్రతి నెలా రెండు ఆదివారాలు క్లాసులు. ప్రతిక్లాసూ రెండు గంటలు. మొదటి గంట తెలుగు మాట్లాడటం నేర్చుకోవటానికి. తెలుగు మాటలూ, అంకెలూ, వాటితో వాక్య నిర్మాణం చేయటం. ఇద్దరు ముగ్గురు కలిసి చిన్నచిన్న స్కిట్లు మాదిరిగా అందరి ముందూ మాట్లాడటం. వాటిల్లో చాలవరకూ హాస్య సన్నివేశాలే. తరవాత అరగంట ఇండియా గురించీ, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ గురించీ ప్రాజెక్టులు చేయటం. అంటే సస్కృతి, కళలు, ప్రదేశాలు, చరిత్ర అన్నీ. మొదట్లో కొన్ని నేను, కొన్ని కొందరు ఆహ్వానితులు చెప్పేవాళ్ళం. తర్వాత విద్యార్థులే ముందుకి వచ్చి, ఎన్నో విషయాల మీద మాట్లాడేవాళ్ళు. ఇలా విద్యార్థులు చేసే ప్రాజెక్టులు, ఈ తెలుగు బడి మీద అందరికీ ఎంతో ఉత్సాహం కలిగించాయి. తాజ్ మహల్ మీదా, గాంధీగారి మీదా సినిమాలూ డాక్యుమెంటరీలూ చూసేవాళ్ళం. చివరి అరగంటా అక్షరాలు గుర్తుపట్టటం, చదవటం నేర్చుకోవటం.

ఈ అరగంటా ఎవరికీ ఉత్సాహంగా వుండేది కాదు. పిల్లలు ఎందుకొచ్చిన

బాధరా అనుకుంటూ కూర్చునే వాళ్ళు. అందుకని ఒక రోజు ఈ అరగంటా సరదాగా గడపటం ఎలాగా అని ఆలోచించాం. వాళ్ళే నాకు ఒక చక్కటి ఆలోచన ఇచ్చారు. మేము నాలుగైదు టీములుగా క్లాసుని విభజించే వాళ్ళం, చిన్నచిన్న బాస్కెట్ బాల్ టీముల్లాగా. ప్రతి టీమ్‌కి ఒక కాప్టెన్. పోస్టర్ బోర్డు మీద రకరకాల అక్షరాలు వ్రాసి, వాటిని గుర్తు పట్టటం ఆడేవాళ్ళం. గెలిచిన టీముకి చిన్న చిన్న బహుమతులు. త్వరలోనే ఆ అరగంట, క్లాస్ మొత్తం మీద సరదాగా గడిపే సమయం అయింది. ఉగాది పండుగ రోజున తెలుగు అసోసియేషన్ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు కూడా ఇచ్చేవాళ్ళం.

తెలుగు నేర్చుకునేది ఇంగ్లీష్ ద్వారా అంటే ఆశ్చర్యంగా వుంది కదూ. కానీ రెండో తరం వారికి అది చాల కారణాల వల్ల అవసరం. ఒకటి వీళ్ళు ఆలోచించేదీ, అర్థం చేసుకునేదీ ఇంగ్లీష్‌లో. అందుకే అన్ని కారణాల్లోకి ఇది ముఖ్యమైనది. రెండు చాలమంది తల్లిదండ్రులు పిల్లల్ని తెలుగులో మాట్లాడమని బలవంతం చేయటం వల్ల, చాలమందిలో ఒక విధమైన తిరుగుబాటు ధోరణి కనిపిస్తుంది. అందువల్ల ముందుగా నేను, ఒక అంకుల్‌గా కాకుండా వాళ్ళల్లో కలిసిపోవటం అవసరం. అందుకే వాళ్ళతో నేనూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడి వాళ్ళల్లో కలిసిపోయాను. కొన్నాళ్ళలో మేమందరం ఇంగ్లీషూ తెలుగూ కలిపి మాట్లాడటం, తర్వాత చాల వరకూ తెలుగు లోనే మాట్లడటం చూసి, ముందు ఈ పద్ధతిని అనుమానించిన స్నేహితులకి కూడా సంతోషమయింది. విద్యార్థుల తల్లిదండ్రులని మేము క్లాస్‌లో చెప్పినవి మర్చిపోకుండా ఇంట్లో తెలుగులోనే మాట్లాడమని కోరాను. ఒకవేళ పిల్లలు తెలుగులో తప్పులు మాట్లాడినా, తప్పులు పట్టటం మంచిది కాదు. అదే మాటని లేదా వాక్యాన్ని ఇంకో రకంగా ఎలా చెబితే సరిగ్గా వుటుందో, పాజిటివ్‌గా చెబితే బాగుంటుంది.

మా బడిలో తెలుగు నేర్పే పద్ధతి వేరు కనుక, ఇంగ్లీష్ ద్వారా తెలుగు నేర్పే సిలబస్ వేరే తయారు చేయవలసివచ్చింది. వ్రాయటం మొదలుపెట్టాక తెలిసింది, ఎంత వుందో వ్రాయవలసింది అని. అది రాయటానికి కొన్ని నెలలు పట్టింది. దాన్ని ఒక పుస్తకరూపంలో తీసుకువచ్చి, అందరికీ అందుబాటు చేయాలన్న మిత్రుల విద్యార్థుల కోరిక, త్వరలోనే తీర్చాలని నా కోరిక. చూద్దాం ఎప్పుడు అది పూర్తవుతుందో.

అయితే తెలుగు నేర్చుకునే అవసరం ప్రవాసాంధ్ర పిల్లలకి వుందా? తప్పకుండా వుంది. అలా ఇష్టం వున్నవాళ్ళకి మనం ఇవ్వగలిగేదేమిటి? అవకాశం కల్పించటం. ఎలా? ఈ వ్యాసంతో స్పందిస్తే, మీరే ఆలోచించండి.

నేనిది వ్రాసిన ఉద్దేశ్యం తెలుగేతర ప్రాంతాల్లో, తెలుగు పిల్లలకి తెలుగెలా నేర్పుతున్నామో చెప్పాలని. దీనివల్ల మిగతా చోట్ల బడులు నిర్వహించేవారికి, కొత్త భావాలు, అనుభవాలు పంచిపెడదామని. అలా ఉపయోగపడితే, నాకు అంతకన్నా కావల్సిందేముంటుంది?

0 0 0